# గీతోపదేశం !

ఆ గ్రామంలో పెంటయ్య పోరంబోకు! చదువు సంధ్య లేని వాడు కావటాన వూహ తెలిసిన నాటి నుండి గొడ్లు కాచుకుంటూ పెద్ద కులస్థుల పంచలో అంతో ఇంతో ముద్దతిని...వాళ్లు విడిచి ముఖాన పారేసిన గుడ్డలు కట్టుకుంటూ... ఊరిచివర పాకలో పడుకుంటూ బతికేస్తున్నవాడు.

పెంటయ్యను ఎవరు కన్నారో? ఆ గ్రామానికి ఎలా వచ్చాడో ఎవరికీ తెలీదు. చెట్టుకింద పడివున్న పసికందును ఓ పాలేరు సాకాడు. పాలేరు కూడా రెక్కలకష్టం మీద బ్రతుకుతున్నవాడే కాబట్టి... పెంటయ్యని సాకి బువ్వపెట్టి పెద్ద చేయలేక వూరి మీదకి వదిలి గొడ్లు కాచుకోమని సలహా ఇచ్చాడు.

నేరేడు పండువంటి నల్లటి శరీర చాయ...తైలసంస్కారం లేని జుట్టు.... తీరుగా పళ్లు తోముకోనందున పాచి పట్టిన పళ్లు... నిత్యమూ గొడ్ల మధ్యే తిరిగేవాడు కావటంతో పెంటయ్య శరీరం దుర్గంధ భూయిష్టంగా వుంటుంది.

చెరువులో బర్రెల్ని గడ్డితో తోమినట్టు తనూ చెరువలోకి దూకి అదే గడ్డితో వళ్లు శుభ్రపరచుకున్నా వంటి దుర్వాసన ఆమడ దూరం కొడుతుంది.

పదిళ్లల్లో పెట్టే చద్ది బువ్వ తింటూ హాయిగా స్వేచ్ఛగా బతికేస్తున్నాడు. తనకంటూ ఏవరూ లేని అనాథ కాబట్టి... గ్రామంలో వారిని బాబాయ్,పిన్నమ్మా... అంటూ పిలుస్తుంటాడు.

గొడ్లు గట్లమీద మేస్తుంటే పెంటయ్య దగ్గర్లో వుండే చెట్టు కొమ్మమీద కూర్చుని వేణువు వూదుతూంటాడు. కోడి ఈకలు జుత్తులో గుచ్చుకుని తానే గోపాలుడనుకుని మురుస్తూంటాడు.

వానకు తడుస్తూ ఎండకు ఎండే జీవితం పెంటయ్యది. తనకేది అవసరమొచ్చినా...గ్రామంలో వారిని అర్థించి... దేబిరించి... ఇచ్చేదాకా వెంటపడి అవసరం తీర్చుకుంటాడు.

అవూరి సర్పంచో... మరో భూస్వామో.. డబ్బుగల ఆసాములో అప్పుడప్పుడు డబ్బులు కూడా ఇస్తూంటారు. అట్లా ఇచ్చిన డబ్బుని ఖర్చు చేయకుండా ఒక గుడ్డ సంచిలో పెట్టి పాకలో వుండే గుంజకి వేలాడతీస్తాడు. ఆ డబ్బుతో తేగలో... జంతికలో కొనుక్కుంటూ వుంటాడు..

ఆ గ్రామంలో పెంటయ్యని ఎవరూ ఏమీ అనరు. అనాథనేసి అపురూపంగా

చూసుకుంటూ వుంటారు. అక్కడివారే వాడికి తల్లీతండ్రి ఆప్తులు.. అత్మీయులు!

పెంటయ్యకి ఆవూరివారి అండ వుంది.

ఒకసారి కాస్పేపు వూరి చివర చెరువులో ఈదులాడి వంటిన బట్టల్లేని శరీరాన్ని ఎండలో ఆరబెట్టుకుంటూ వుండగా.. దారిన పోయే సాధువొకాయన పెంటయ్యనుచూచి... ముందుకు పోబోయేవాడల్లా ఆగి.. వాడిని దగ్గరకు పిలిచి...చేతిని తన చేతిలో తీసుకుని అరచేతిలో రేఖలు పరీక్షించి.. నువ్వు ఒకనాటికి గొప్పోడి వౌతావన్నాడు! డబ్బు పేరు కీర్తి పొందగల మహర్జాతకుడు అన్చెప్పగానే... ఎగిరి గంతేసి తెగ సంబర పడ్డాడు పెంటయ్య.

సాధువు చెప్పిన మాటల్ని ఆ రోజు సర్పంచ్ రామిరెడ్డితో చెప్పాడు. అందుకాయన పకపకా నవ్వి 'ఏడిచావులేరా కుర్రకుంక!... గొడ్లు కాచుకు బతికే అనాధకి రాజ యోగమా? నోర్మూసుకో!... అనేసి ఎగతాళిగ మాట్లాడాడు రామిరెడ్డి.

ఆ మాటలు విని మనసు చిన్నబుచ్చుకున్నాడు పెంటయ్య.

రోజూ నిద్రపోయే ముందు సాధువు చెప్పిన మాటలే పెంటయ్య చెవిలో గుడిగంటల్లా మోగ సాగినయ్.

ఒకరోజు వేణుగోపాల స్వామి గుడికెళ్లి పగడపూలు... పున్నాగపూలు కోసి స్వామిపాదాల ముందు వుంచి తనను గొప్పవాడిని చేయమంటూ దేవుడ్ని వేడుకుని సాష్టాంగ పడ్డాడు.

★★★★★

ఇరవైయేళ్లు వచ్చేసరికి సర్పంచ్గారి సహచర్యం మూలాన రాజకీయాలు వంట బట్టించుకున్నాడు పెంటయ్య. పేపరు చదవటం రాక పోయినా.. సంతకం చేయటం చేత కాక పోయినా... పెద్దోళ్లు మాట్లాడుకునే సంగతులు ఆలకిస్తూ రాజకీయాల పట్ల ఆసక్తి పెంచుకున్నాడు.

సర్పంచ్ గామిరెడ్డి వ్యక్తిగత కాపలాదారుడిగా పెంటయ్య స్థాయి పెరగటంతో గొడ్లు కాయటం మనేశాడు. రెడ్డి గారు కొనిచ్చిన ఖద్దరు పంచలు కట్టుకో నారంభించాడు.

గంజితాగే పెంటయ్యకి ఇప్పుడు ఆ వూళ్లోవారంతా జొన్నన్నం పెడుతున్నారు.

ఎవరు ఎదురైనా రెండు చేతులెత్తి నమస్కరించటం.. మర్యాదగా పలుకరించటం అలవరచుకోవటం మూలాన ఆవూరి వారి మధ్య పెంటయ్య గౌరవం ఆప్యాయతాభి మానాలు రెట్టింపైనాయ్!

పెంటయ్యలో వున్న చురుకుదనం రాజకీయాల పట్ల ఆసక్తి గమనించిన సర్పంచ్ రామిరెడ్డి మరిన్ని తెలివితేటలు నూరిపోసి... తనకు వయసై పోవటంతో... తన వారసుడిగా సర్పంచ్ పదవికి పెంటయ్యను ప్రతిపాదించాడు.

రామిరెడ్డి ప్రతిపాదనను గ్రామస్తులందరూ ఏకగ్రీవంగా ఆమోదించటంతో... పోటీ లేకుండానే పెంటయ్య సర్పంచ్ కాగలిగాడు.

వూరికి తన సేవలందిస్తానంటూ ప్రమాణం చేసాడు. ఆ గ్రామస్తుల హితం కోరేవాడు కావటంతో పెంటయ్య అతి స్వల్ప కాలంలో అందరివాడయ్యాడు.

తన సరసన కూర్చోబెట్టుకుని భోజనం చేస్తున్న సమయంలో 'ఒరే పెంటయ్యా! నువ్వు నిజంగా అదృష్టవంతుడివి నాకు పిల్లల్లేక పోవటం వల్ల నిన్ను నా మనిషిగా భావించాను. నీ మీదే ఆశలు పెంచుకున్నాను. నిన్ను సర్పంచ్‌ని చేసాను. నువ్వెడ బుట్టినవో.. ఎవరికి బుట్టినవో... అడవిలో వుసిరికాయ..సముద్రంలో ఉప్పు ఒకటైతేఊరగాయ పచ్చడైనట్టు... నీవెవరో... నేనెవరో... అయినా ఏనాటి బంధమో మనిద్దర్నీ దగ్గర చేసిందిరా పెంటయ్య. రామిరెడ్డి అశ్రుపూరిత నయనాలతో అన్నాడు.

'అంతా తమ దయే దొరా!' విస్తట్లో పెరుగు అన్నం కలుపుతూ ప్రేమాభిమానాలు ఉట్టిపడేట్లుగా అన్నాడు పెంటయ్య.

'అవున్రా!... చిన్ననాడు నీ చెయ్యి చూచి సాధువు చెప్పిన మాటలు నిజమైనయ్!- నీవేనాటికైనా పెద్ద నాయకుడివై పోతావన్పిస్తోందిరా...'

ఇద్దరూ భోజనం ముగించారు.

సర్పంచ్ పెంట్యయ్య రామిరెడ్డి ఇంట్లో ఒక సభ్యుడైనాడు.

శాసన సభకు ఎన్నికలు దగ్గరపడటంతో సర్పంచ్ పెంటయ్యకి పార్టీ టిక్కెట్టిప్పించి ఎం.ఎల్.ఏ. గా పోటీకి నిలబెట్టాలని రామిరెడ్డి తాపత్రయపడ్డాడు.

అది రిజర్వ్‌డ్ స్థానం కావటంతో...రామిరెడ్డి చేసిన ప్రయత్నం ఫలించి... పెంటయ్యకి పార్టీ టికెట్టు లభించింది.

నామినేషన్ దాఖలు చేసిన రోజు నుంచే పెంటయ్య తరపున ప్రచారం వూపందుకుంది. గ్రామస్తులంతా ఏకమై ఒకే మాటమీద నిలబడి ఎలాగైనా సరే పెంటయ్యని ఎన్నికల్లో గెల్పించాలని సంకల్పించారు.

ప్రచారం తీవ్ర స్థాయిలో లేక పోయినా.. బేనర్లు... కటౌట్లు... అన్ని చోట్ల ప్రతిష్టించలేక పోయినా... రిగ్గింగ్‌కి పాల్పడక పోయినా..దొంగ ఓట్లకి పూనుకోక పోయినా.....డబ్బు ..సారా పాకెట్లు పంచకపోయినా..ఎన్నికల్లో పెంటయ్య అఖండమైన మెజారిటీతో గెలిచాడు.

అంతా రామిరెడ్డి... వూరివారి చలవేనంటూ మనిషి మనిషికీ కృతజ్ఞతలు తెలుపుకున్నాడు తాను గెలిచినందుకు.

దురదృష్టమేమంటే..ఎన్నికల్లో గెలుపొందిన ఏ పార్టీకీ మెజారిటీ లేక పోవటంతో సంకట పరిస్థితి ఏర్పడింది.

స్వతంత్రంగాపోటీ చేసి గెల్చిన వారిని కలుపుకోవాలని అన్నీ పార్టీలు తీవ్రప్రయత్నం చేస్తున్నాయ్.

డబ్బు ఎరగా వేస్తున్నారు. మంత్రి పదవులు కట్టబెడతామని ఆశలు చూపుతున్నారు.

పై ప్రతిపాదనలో భాగంగా పెంటయ్యను కూడా ప్రలోభపెట్ట ప్రయత్నించినయ్ రాజకీయ పార్టీలు..! యాభై లక్షలిస్తామన్నారు. రామిరెడ్డి ప్రోద్బలంతో కోటి కావాలని కోరాడు పెంటయ్య. అయినా పాచిక పారలేదు. మరో పార్టీ వారొచ్చి ఏకంగా మంత్రి పదవే ఇస్తామంటూ తమవేపు పెంటయ్యని తిప్పుకో ప్రయత్నించారు.

అందుకు రామిరెడ్డి.. పెంటయ్య 'సై' అన్నారు.

పెంటయ్య చేరిన పార్టీకి మెజారిటీ లభించడంతో మంత్రివర్గం ఏర్పాటు చేయగల అవకాశం వారికే దక్కింది.

మంత్రి పదవుల కోసం పైరవీలు జోరుగా సాగుతున్నాయ్. ఎవరి పలుకుబడి వారు ఉపయోగిస్తున్నారు.

పెంటయ్య రిజర్వ్‌డ్ ఎం.ఎల్.ఏ. కావటంతో ఎటువంటి ప్రయత్నమూ చేయకుండానే మంత్రి పదవి అతడిని వరించింది. మొత్తానికి కేబినెట్‌హోదాగల మంత్రి పదవిని కైవశం చేసుకోగలిగాడు.

మకాం రాష్ట్ర రాజధానికి మార్చాడు. తనకు కేటాయించిన బంగళాలో నివాసం ఏర్పరచుకున్నాడు. ప్రమాణ స్వీకారం చేసాడు. అయినవారు కానివారు అభినందించారు. పూల మాలలతో ముంచెత్తారు.

పెంటయ్య ఇప్పుడు హోంశాఖామాత్యుడు! చుట్టూ నిత్యమూ ప్రదక్షిణాలు చేస్తూ కాళ్లకు మొక్కే పోలీసు అధికారబృందాన్ని చూస్తూ మొదట్లో విస్తుపోయాడు.

తనకు సలహా ఇచ్చేటందుకు అనధికార... అధికార పరంగా అరడజను మంది పి.ఏ.లు! ఎక్కడికి కదిలినా పోలీసు ఎస్కార్టు!

ఇదాంతా తమాషాగా, అయోమయంగా అన్పించినా పర్సనల్ పి.ఏ. అవసరం మేరకు తగిన సలహాలు ఇస్తూ వుండటంతో పెంటయ్యలోగల అయోమయావస్థ కాస్తంత దూరమైంది.

ఆ పని కావాలంటూ... ఈపని చేయమంటూ పైరవీకారుల..రికమెండేషన్ల ధాటికి తట్టు కోలేకపోతున్నాడు పెంటయ్య.

నిముషం ఖాళీ లేకుండా.. క్షణం తీరిక లేకుండా వుంది... రాత్రింబవళ్లుపని..పని..పని!

నీతి నిజాయితీకి కట్టుబడిన తాను అవినీతి సర్పాన్ని కౌగిలించుకోక తప్పదన్పిస్తోంది.

పి.ఎ. ప్రోద్బలం మరోవైపు వుక్కిరిబిక్కిరి చేస్తోంది.

మొదట్లో కొత్త గనుక కంగారుగానే వుంటుంది. తర్వాత నరమాంసానికి అలవాటైన పులిలా... మీరు ఈ పదవిని విడిచి వుండలేరన్పించకమానదు. అవకాశం వున్నప్పుడే నాలుగు రాళ్లు సంపాదించి వెనకేసుకోవాలి! మళ్లీ వచ్చే ఎన్నికల ఖర్చుకు సరిపడా వెనకేసుకోక తప్పదుసార్. రాజకీయాల్లో తిరుగుతూ పదవిలోకొచ్చి నీతులు వల్లిస్తే... మడి గట్టుకు కూర్చుంటే పిచ్చోడంటారు. దక్కినంత మేరకు మెయ్యటమే! ప్రజల ప్రయోజనాలు.. బాగోగులు... ఎవిడిక్కావాలి! మీలో స్వార్థ చింతన పెరగాలి. పరపతి పెంచుకోవాలి! పది మందికి సాయపడాలి! వట్టినే కాదు. 'అమ్యామ్యాలు' అంగీకరించాలి. పది బంగళాలు.. వందెకరాల పొలం... వెయ్యి కె.జీల బంగారం... ఇంకా అనేక కూడబెట్టుకోవాలి! అందరూ చేసే పనే ఇది! మీరేం కొత్తగా ఫీలవకండి. మేమంతా వున్నాం. పని చేసి పెట్టినందుకు మూటలు మేము అందకుంటాం! వాటిని రహస్యంగా మీ పరం చేస్తాం! మీ చేతికి మట్టి అంటకుండా చూస్తాం! పేపర్వాళ్లని...ఎలక్ట్రానిక్ మీడియా వారినీ దువ్వుతుండండీ! వాళ్లకు పార్టీలు ఇస్తూండండి! అంతా సజావుగా సాగిపోతూంటుంది! బెదిరిపోకండిసార్! మాకు మీరున్నారు... మీకు ప్రజలున్నారు! సి.యమ్.గారి 'గుడ్లుక్స్'లో వుండండి! వారితో సన్నిహితంగా వుంటూ వారి పన్లు చేస్తున్నన్నాళ్లు మీ పదవికి ఢోకా లేదు. పదిలంగా... పచ్చగా...పది కాలాలపాటు కొనసాగుతారు...' అంటూ గుక్క తిప్పకోకుండా పి.ఎ. వూదరగొడుతూంటే ఆ క్షణంలో గీతోపదేశం చేస్తున్న శ్రీకృష్ణ పరమాత్ముడిలా అగుపించాడు పి.ఎ. పెంటయ్య కళ్లకు.

తాను అర్జునుడైనట్టు ఫీలై పోతూ ఒకమోకాలు వంచి నేలకాన్చి చేతులు జోడిస్తూ రెప్పవాల్చకుండా చెవులిక్కరించి చెప్పేవి శ్రద్ధగా బుద్ధిగా వింటూ గీతాసారాంశాన్ని బుర్ర కెక్కించుకునే ధ్యాసలో మునిగిపోయాడు పెంటయ్య మంత్రి మహాశయుడు!

-:(సమాప్తం):-